# అమెరికా సామ్రాజ్యవాదం - ద్వంద ప్రమాణాలు

**ఇరాక్** విషయానికొచ్చేసరికి, ఐక్యరాజ్యసమితి చేసిన భద్రతామండలి తీర్మానాన్ని ఇరాక్‌పై తన దాడి ఆమోదానికి సమర్ధనగా ప్రపంచ ప్రజానీకాన్ని ఒప్పించటానికి అమెరికా ఉపయోగించుకుంటోంది. ఉత్తరకొరియా లొంగి రావాలని బెదరగొట్టటానికి అమెరికా, ఐక్యరాజ్యసమితి యొక్క అణునిరాయుధీకరణ తీర్మానం గురించి మాట్లాడుతోంది. ఎందుకంటే, ఈ తీర్మానం అమెరికా సామ్రాజ్యవాదానికి అనుగుణంగా ఐక్యరాజ్యసమితి చేసింది కనుక!

ఈ అంతర్జాతీయ సంస్థ తన కోర్కెలకు విరుద్ధంగా వెళితే, అమెరికా తన బెదిరింపు ఎత్తుగడలతో ఐక్యరాజ్య సమితిని తన ఆదేశాలు అంగీకరించేలా చేసుకుంటుంది. ఓటింగ్‌ద్వారా పాలస్తీనాను ఒక సభ్యదేశంగా చేర్చు కోవటానికి యునెస్కో చేసిన నిర్ణయానికి ప్రతీకారంగా 2011లో 'యునెస్కో'కు అమెరికా నిధులను నిలిపి వేసింది. 'యునెస్కో' వద్ద విధులు నిర్వహించటానికి నియమించబడిన అనేకమంది రాయబారులను ట్రంప్ ప్రభుత్వం నిలిపివుంచి, వారిని ఇతర ఉద్యోగాలు చూసుకోమని సలహా ఇచ్చింది. ఐక్యరాజ్యసమితికి అమెరికా రాయబారి అయిన నికి హెయిలీతో సహా అమెరికా అధికారులు యునెస్కోపట్ల పదేపదే అసమ్మతిని తెలియపరుస్తూ వుండటమే దీనికి కారణం. ట్రంపు అధికారంలోకి వచ్చిన తరువాత రూపొందించిన బడ్జెట్‌లో కూడా పరిస్థితిలో ఏ మార్పు వుండబోదంటూ యునెస్కోకు ఎలాంటి నిధులూ కేటాయించలేదు.

అక్టోబర్ 3వ వారంలో యునెస్కో తన నూతన డైరెక్టరును ఎన్నుకోవలసి వుండగా, అమెరికా ఉన్నతాధికారులు అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ యునెస్కో నుండి బయట పడాలనుకుంటున్నట్లుగా తెలియజేశారు.

అమెరికా సామ్రాజ్యవాదపు ప్రజాస్వామ్యానికి, ద్వంద ప్రమాణాలకు నిజమైన అర్ధమిది!

ooooo